## అవివాహితుడు ముకుంద స్వామికి రూ 4వేలు ఆర్థిక సహాయం



**కందుకూరు శిఖర జనసాక్షి:** పైకం కన్నా పరోపకారం మిన్న.. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం ద్వారా సాటి మనిషికి సహాయం చేయడంలో ఉండే ఆనందం అవసరాన్ని మించి పైకాన్ని దాచుకోవడంలో ఉండదని శ్రీవారి సేవాసమితి వ్యవస్థాపకలు మూర్తి అన్నారు.కందుకూరు పట్టణంలో అవివాహితుడైన ముకుందస్వామి అనే నిరుపేద గత కొంత కాలంగా అనా రోగ్యంతో బాధపడుతూ తనకున్న అనారోగ్యాన్ని నయం చేసుకొనుటకు గాను ఆర్థిక సహాయం కోరాడు.ఈ సందర్భంగా శ్రీవారి సేవాసమితి సౌజన్యంతో గురువారం ముకుందస్వామికి వైద్య ఖర్చుల కోసం రూ4వేలు నగదును ఆర్థిక సహా చేయడం జరిగింది.ఈ సందర్భంగా శ్రీవారి సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఏ.వి.ఆర్. మూర్తి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తనకు ఉన్నంతలో అర్హులైన నిరుపేదలకు దానం చేయడం అలవాటు చేసుకోవాలని,దానగుణం యొక్క విశిష్టతను పిల్లలకు పాఠశాల స్థాయి నుండే నేర్పాలని తెలియజేశారు. స్థానిక శ్రీవారి సేవాసమితి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీవారి సేవాసమితి ప్రధానకార్యదర్శి శీతాళం.విప్రనారాయణ,గణపతిరాజు వెంకట శేషగిరిరావు, పూజల వెంకట శ్రీనివాసులు,ఇనకొల్లు మస్తానయ్య, ప్రింటింగ్ ప్రెస్ శివ,నలమోలు వెంకట మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాలలో కందుకూరు పబ్లిక్ స్కూల్ విజయదుందుభి



**కందుకూరు శిఖర జనసాక్షి:** గురువారం ప్రకటించిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో సిహెచ్ వి.సంజన (596/600) మార్కులతో స్కూల్ ఫస్ట్‌గా, ఏ.వైశాలి(591/600) మార్కులతో స్కూల్ సెకండ్,పి.వీ.ప్రణీత్ సాయి (587/600)వంటి అత్యుత్తమ మార్కులతో విజయభేరి మోగించారని పాఠశాల కరస్పాండెంట్ పి.వేణుగోపాల్ తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ టి.పద్మావతి ఇద్దరు విద్యార్థులను అభినందించి ఒక్కొక్కరికి పదివేల రూపాయల నగదును అందించారు. ప్రధానోపాధ్యాయులు డి.బాల బ్రహ్మం ఇద్దరు విద్యార్థులను ఆశీర్వదించి భవిష్యత్తులో మంచి స్థాయిని పొందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు

## కందుకూరు వాసవి నగర్‌లో ఉచిత వైద్య శిబిరం



**కందుకూరు శిఖరజనసాక్షి:** ఒంగోలులోని ప్రముఖ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఉపాస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో కందుకూరు వాసవి నగర్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ వైద్య శిబిరంలో ప్రముఖ మోకాళ్ళ మార్పిడి వైద్య నిపుణులు డాక్టర్ ప్రకాష్ చవల,ప్రముఖ ఇంటర్వెషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మార్తాండం వెంకటేష్,ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ ఎన్.పవన్‌కుమార్ డాక్టర్లు ఉచిత వైద్య శిబిరంలో రోగులను పరీక్షించారు. వారికి బీపీ,షుగర్,ఈసీసీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఉపవాస హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చవల మాట్లాడుతూ ఉపాస్ హాస్పిటల్ కేవలం వ్యాపార దృక్పథంతోనే కాకుండా సమాజానికి తమ వంతు సేవలు అందించాలనే దృక్పథంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు కందుకూరు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు.




## మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి జయంతి ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే





**వలేటివారిపాలెం శిఖర జనసాక్షి:** రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రం మాల కొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జయంతి ఉత్సవాలు ఈ నెల 2వ తేదిన అంగ రంగ వైభవంగా నిర్వహించనున్న నేపథ్యంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం ఏర్పాట్లను పరిశీలించారు.స్వామివారి దర్శన ఏర్పాట్లు,అదనపు క్యూలైన్లు,తాగునీరు,భోజనసదుపాయాలు,అదనంగా లడ్డూ ప్రసాదాల తయారీ,వాహనాలపార్కింగ్,పోలీసు బందోబస్తు,దాతలు, సేవకుల సహకారం,ఇంకా పలు ఏర్పాట్లను అధికారులతో కలిసి ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు.ఆలయ ఈఓ చంద్రశేఖర్,పోలీసులకు పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉత్సవాలకు 25 నుంచి 30 వేల మంది భక్తులు తరలి రావచ్చని అంచనా వేస్తున్నామన్నారు.వారందరూ సంతృప్తిగా శ్రీలక్ష్మీ సమేత నరసింహస్వామిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.దర్శనం అనంతరం,ప్రతి ఒక్కరికీ భోజన ప్రసాదం అందేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు.అందుకోసం డైనింగ్ హాల్‌తో పాటు వెనుక వైపు ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేసామన్నారు.అలాగే 30వేలకు పైగా లడ్డు ప్రసాదాలను భక్తులకు అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. తీవ్రమైన ఎండలను దృష్టిలో ఉంచుకుని,దాతల సహాయంతో మజ్జిగ ప్యాకెట్లు,వాటర్ బాటిల్స్ భక్తులకు అందజేసే ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు.దేవస్థానం సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.భక్తులకు ఎండల నుంచి ఉపశమనం కలిగేలా,చలువ పందిళ్లు,కార్పెట్లు, కూలర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.వాహనాల పార్కింగ్ విషయంలో భక్తులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు నాగేశ్వరావు చెప్పారు.భారీ వాహనాల పార్కింగ్ కోసం,కొండ కింద ఆర్చ్ సమీపంలో విశాలమైన ప్రదేశాన్ని సిద్ధంగా ఉంచామని చెప్పారు.కొండపైకి ద్విచక్ర వాహనాలు, పరిమిత సంఖ్యలో కార్లను మాత్రమే అనుమతిస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు.స్వామివారి జయంతి సందర్భంగా కందుకూరు సబ్ డివిజన్ పరిధిలోని అన్ని స్టేషన్ల నుంచి సుమారు 100 మందికిపైగా పోలీసు సిబ్బంది విధుల్లో ఉంటారని ఆలయ అధికారులు ఎమ్మెల్యేకు తెలియజేశారు.జయంతిని పురస్కరించుకుని, మాలకొండ దేవస్థానం పరిధిలో పనిచేసే 123 మంది ఉద్యోగులకు యూనిఫామ్‌ను ఎమ్మెల్యే నాగేశ్వరరావు చేతుల మీదుగా అందించారు.కార్యక్రమంలో వలేటివారిపాలెం మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం,నేతలు పెగడ శ్రీనివాసులు, బొల్లినేని నాగేశ్వరరావు,కామినేనిఅశోక్,మోహన్,శనివారపు మాల్యాద్రి తదితరులు ఎమ్మెల్యే వెంటఉన్నారు.

## అభివృద్ధి చేసి మీ రుణం తీర్చుకుంటా-ఎమ్మెల్యే







**లింగసముద్రం శిఖర జనసాక్షి:** నా గెలుపుకు చినపవని గ్రామస్తుల పాత్ర ఎంతో ఉందని,పంచాయితీనీ అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటానని కందుకూరు శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు.లింగసముద్రం మండలం చినపవని పంచాయతీలోని సత్యనారాయణ పురంలో 26 లక్షల ఉపాధి పథకం హామీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో చినపవని పంచాయతీలో గత ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ ఇచ్చారని గుర్తు చేసుకున్నారు.పంచాయతీలోని చిన్నగ్రామం సత్యనారాయణపురంలో ఈ 22 నెలల కాలంలో 50 లక్షల రూపాయలకు పైగా ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు.రాబోయే మూడేళ్లలో పంచాయతీలో పెద్ద ఎత్తున అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తానన్నారు.ప్రతి ఒక్కరూ కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను గుర్తించి,ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలని ఎమ్మెల్యే కోరారు. గ్రామస్థాయిలో చిన్నచిన్న విభేదాలను పక్కనపెట్టి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కష్టపడాలని ఆయన సూచించారు. అంత కుముందు సీసీరోడ్ల శంకుస్థాపన శిలాఫలకాలను ఆయన ఆవిష్కరించారు.

**వాటర్ ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే...** సత్యనారాయణపురంలో స్వర్గీయ దామా విజయ జ్ఞాపకార్థం,ఆమె భర్త రమేష్,కుమారులు బాలకృష్ణ,హరికృష్ణలు సుమారు 6 లక్షల రూపాయలతో మంచినీటి శుద్ధ జల కేంద్రాన్ని ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దానిని ప్రారంభించారు. ఈ సంద ర్భంగా దాతలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.బయట ప్రాంతాలలో ఆర్థికంగా స్థిరపడిన వారు,సొంత గ్రామాలలో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేసేందుకు ముందుకు రావాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వం తరఫునుంచి వారికి సహాయ సహకారాలు ఉంటాయ న్నారు.ముందుగా గ్రామంలోకి వచ్చిన ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు స్థానిక నాయ కులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు,పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసులు,మండల టీడీపీ అధ్యక్షుడు పూరిమిట్ల గురునాథం,గ్రామ అధ్యక్షుడు మోతుకూరి పర్వతాలు,స్థానిక నాయకులు సోం పల్లి మనోహర్,గొర్రెపాటి శ్రీను,బోయపాటి వెంకటేశ్వర్లు, కొడాలి శ్రీధర్,పారాబుచ్చయ్య,రాళ్లపాడు ఆయకట్టుదారుల సంఘం అధ్యక్షుడు ఏలూరి వెంకటే శ్వర్లు,చినపవని చెరువు నీటి సంఘం అధ్యక్షుడు పొతకమూరి రమేష్,మాధవరపు మహేశ్వరరావు, పోకూరి రవీంద్ర,మాధవరపు బ్రహ్మయ్య, మండల నేతలు వంకాయలపాటి మాల్యాద్రి,గొర్రెపాటి సాంబయ్య, షేక్.నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## పదిలో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు









**గుడ్లూరు శిఖర జనసాక్షి:** రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని పదవ తరగతి విద్యార్థులు సత్తా చాటి మంచి మార్కులు సాధించారు. బసిరెడ్డి పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో మండలం ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాపులూరి వెంకటేశ్వర్లు తెలిపారు. మామిడాల వెంకట ప్రేమ్ కుమార్-571,యాళ్ల గీత-570, కుడుముల అక్షయ-568,ఆళ్ల దీక్షిత-566 మార్కులు సాధించారని వెంకటేశ్వర్లు తెలిపారు.అలాగే మొగుళ్ళురు గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో పదవ తరగతి విద్యార్థినిలు మంచి మార్కులు సాధించారని విద్యాలయ ప్రత్యేక అధికారిని అమృత జోష్నా తెలిపారు.ఏ.లక్ష్మీ ప్రసన్న-561,ఎం. మాధురి-560,జి.పూజిత-530మార్కులు సాధించారని ఆమె తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఎంఈఓలు హరేరామ్, గోవర్ధన్‌లు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.మండలంలో 136మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయగా 101 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వారు తెలిపారు.

Printed by HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL),PRAKASAM/ ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Published by YARAMALA NAGABHUSHANAM, Dr.No.1-9-1, BADEVARIPALEM, VALETIVARI PALEM MANDAL, PRAKASAM, ANDHRAPRADESH - PIN. 523113. RNI : APTEL/26/A1736, E-mail :yaramala786@gmail.com